# బట్టబయలైన పెద్దనోట్ల రద్దు బండారం

**చెలామణిలో** వున్న ద్రవ్యంలో 86శాతంగా వున్న పెద్దనోట్లను మోడీ ప్రభుత్వం రద్దుచేసింది. నల్లధనం వెలికితీత, టెర్రరిస్టులకు, నక్సలైట్లకూ నిధులు అందకుండా చేయటం, దొంగనోట్లను తొలగించటం ప్రభుత్వ లక్ష్యంగా చెప్పుకుంది. 4 నుండి 5 లక్షల కోట్ల రూపాయల విలువగల నల్లధనం తిరిగిరాదనీ, పన్నుల చెల్లింపు పెరుగుతుందనీ, అనియతరంగం నియంత్రణలోకి వస్తుందనీ చెప్పింది. వారం తర్వాత నగదు చెలామణివల్ల అవినీతి సాగుతున్నదనీ, దీని నరికట్టేందుకు నగదు రహిత ఆర్థికానికి పరివర్తనే నోట్లరద్దు లక్ష్యమనీ సుప్రింకోర్టుకు చెప్పింది. మరోవారం గడిచేసరికి మోడీనే 'నగదు రహితం కాదు, తక్కువ నగదు లావాదేవీలు లక్ష్యమ'ని చెప్పుకున్నాడు.

నోట్ల రద్దువల్ల ఆర్థిక వ్యవస్థ పుంజుకున్నదనీ, జిడిపి 8 శాతం వరకూ పెరుగుతుందనీ ఆర్థికమంత్రి ప్రకటనలు గుప్పించాడు. కొత్తనోట్లు అందక మధ్యతరగతి వర్గాలు కొంతమేరకు నగదు రహిత లావాదేవీలు చేయటాన్ని చూపెట్టి ప్రజలెదుర్కొన్న "తాత్కాలిక యిబ్బందులు" మంచి ఫలితాలివ్వటంతో మోడీకి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారంటూ ప్రచారంచేశారు. ఇదంతా తప్పుడు ప్రచారమని ఇప్పుడు తేలిపోయింది.

బడ్జెట్టు సమయంలో అందజేసే ఆర్థిక సర్వే రెండవ భాగాన్ని పార్లమెంటు సమావేశం చివరిరోజున ప్రవేశపెట్టారు. రద్దయి బ్యాంకులకు చేరిన పాతనోట్ల లెక్కింపుకు 8 నెలలు తీసుకున్న రిజర్వుబ్యాంకు, తన వార్షిక నివేదికను ఆగస్టులో విడుదల చేసింది. ఈ రెంటిలోని సమాచారాన్ని పరిశీలించిన వారందరికీ ప్రకటిత లక్ష్యాలలో ఏ ఒక్కదానినీ నోట్లరద్దు సాధించలేకపోయిందని స్పష్టమౌతుంది.

రిజర్వుబ్యాంకు లెక్కల ప్రకారం రద్దయిన నోట్లలో 98.96శాతం తిరిగి బ్యాంకులలో జమఅయ్యాయి. జమకాకుండా మిగిలిన 1.4 శాతం నోట్ల విలువ రూ॥16 వేలకోట్లు మాత్రమే. సహకారబ్యాంకులలోనూ, నేపాలులోనూ జమైన నోట్లు ఇంకా లెక్కించాల్సి వున్నందున, జమకాని నోట్ల విలువ ఇంకా తగ్గుతుంది. ఈ 16 వేల కోట్లు నల్లధనమనుకుంటే, నాలుగు నుండి ఐదులక్షల కోట్ల రూ॥ వరకూ నల్లధనముందని ప్రభుత్వం చెప్పినదంతా ఏమయినట్లు? నల్లధనవంతులు అతికొద్ది మాత్రమే అయివుండాలి లేదా బ్యాంకుల్లో జమచేసే మార్గాలను వారు కనుగొని వుండాలి.

అయితే జైట్లీగారి వద్ద దీనికి మరో సమాధానం వుంది. నోట్లరద్దు, వస్తుసేవల పన్ను కలిసి "భారత ఆర్థిక వ్యవస్థ నైతిక పునాదినీ, నిర్మాణాన్నీ మార్చివేసాయ"ట. దీని అర్థమేమిటి? అక్రమార్జనా పరులందరూ బుద్ధితెచ్చుకుని నల్లధనాన్ని జమచేసి, ప్రభుత్వం విధించే జరిమానా చెల్లించేందుకు సిద్ధపడిపోయారట!

వాస్తవమేమిటంటే, నల్లధనం గుట్టలు గుట్టలుగా నోట్ల రూపంలో వుండదు. అది ఎప్పటికప్పుడు బంగారం, రియల్ ఎస్టేటు తదితర ఆస్తుల రూపంలోకి మారుతుంది. విదేశీ బ్యాంకులలోకి వెళుతుంది. ఇది ప్రభుత్వానికీ తెలుసు. ఆదాయపన్నుశాఖ నిర్వహించిన దాడులలో బయటపడిన నల్లధనంలో నోట్ల రూపంలో వున్నది నాలుగుశాతం లోపేనని ఆర్థికశాఖ నివేదికలే తెలుపుతున్నాయి. ఈ కొద్దిపాటి నల్లడబ్బును బ్యాంకులలో జమచేయటం, అక్రమార్జనాపరులకు కష్టమేమీ కాదు. నల్లధనం వెలికితీత అన్న లక్ష్యం సాధించబడలేదన్నది స్పష్టం.

ఇక దొంగనోట్ల తొలగింపుకు వస్తే, రూ॥400 కోట్ల మేరకు దొంగనోట్లు చెలామణిలో వున్నాయన్నది ప్రభుత్వ అంచనా. నోట్లరద్దుకు ముందు ఏడాది 2015-16లో రూ.29.6 కోట్ల విలువగల దొంగనోట్లను గుర్తించి చింపివేశారు. నోట్లరద్దు తర్వాత 2016-17లో గుర్తించిన దొంగనోట్లు రూ॥43.5 కోట్లు మాత్రమే. అంటే నోట్లరద్దు వల్ల అదనంగా గుర్తించింది రూ॥14 కోట్లు మాత్రమే. మొత్తం చెలామణిలో వున్న నోట్లతోపోలిస్తే రూ॥400 కోట్లే అత్యల్పం. కాగా గుర్తించిన వాటితో పోలిస్తే దీనిని లక్ష్యంగా చెప్పుకోవటమే పనికిమాలిన పని.

ఇక టెర్రరిస్టులు తమ కార్యకలాపాలకు డబ్బుపై ఆధారపడరు. వారికి అందుతున్న ఆయుధాలన్నీ అమెరికా సామ్రాజ్యవాదులు వెదజల్లినవేనన్నది స్పష్టం. ఇక వామపక్ష తీవ్రవాదులు తమ కార్యకలాపాలను డబ్బుపైనే ఆధారపడి సాగించరు.

ఇక మిగిలింది నగదు రహిత ఆర్థికం. కొత్తనోట్లు అందక మధ్యతరగతి వర్గాలు నగదురహిత లావాదేవీలను కొంతమేరకు చేయటంతో యివి పెరిగాయి. కొత్త నోట్ల చెలామణి పెరగటంతోనూ, ప్రతి నగదు రహిత లావాదేవీపైనా 18 శాతం సేవా పన్ను విధించటంతోనూ ఈ లావాదేవీలు మునుపటిస్థాయికే తిరిగి చేరాయి. సందట్లో సడేమియాలా బ్యాంకులు ఖాతాదారులపై భారాలుమోపి తమ ఆదాయాన్ని పెంచుకుంటున్నాయి. ప్రతి లావాదేవీ పైనా బ్యాంకులు ఛార్జీలు వసూలు చేస్తున్నాయి. ఖాతాలో కనీస నిల్వలేకపోతే జరిమానా విధిస్తున్నాయి. ఈ ఒక్క పద్దులోనే గత ఆరునెలల్లో స్టేటు బ్యాంకు తన ఖాతాదారుల నుండి దోచుకున్నది రూ॥ 294 కోట్లుగా వుందంటే, బ్యాంకు తన అసలు పనైన ఖాతాదారుల సొమ్మును అప్పులిచ్చి తిరిగి వసూలు చేసుకునేకంటే, ఖాతాదారుల సొమ్ము కైవశం చేసుకోవటంపైనే ఎక్కువ మక్కువ చూపుతున్నాయి. నోట్లరద్దువల్ల ప్రజలకు ఒరిగిన మహా ప్రయోజనమిది!

ఈ వివరణ నోట్లరద్దు తన ప్రకటిత లక్ష్యాలు వేటినీ సాధించలేదని తెలుపుతుంది. ఈ కోణంనుండి యిదొక నిరర్థక చర్యగానే మిగులుతుంది.

ఇక నోట్లరద్దు సమయంలో ప్రజలకు ఏర్పడిన యిబ్బందులు 50 రోజులలో తొలగిపోతాయనీ, ఓపిక పట్టమనీ, దీర్ఘకాలంలో ఆర్థికవ్యవస్థ పుంజుకుంటుందనీ మోడీ ప్రజలకు చెప్పాడు. రిజర్వుబ్యాంకు వార్షిక నివేదిక తర్వాతకూడా ఆర్థికమంత్రి జైట్లీ నోట్లన్నీ

తిరిగి జమకావటాన్ని బట్టి నోట్లరద్దును అంచనా వేయరాదనీ, అన్ని లక్ష్యాల సాధన అత్యంత అనుకూలతగా సాగిందంటూ "భారత ఆర్థికానికీ, ప్రజలకూ అత్యంత లబ్ధిచేకూర్చింద"ని వాదించాడు.

ప్రభుత్వ సమర్ధకులైన ఆర్థికవేత్తలు నోట్లన్నీ తిరిగి జమకావటంవల్ల నల్లధనం తెల్లధనంగా మారిందనీ, దీనికి బ్యాంకులు వడ్డీ చెల్లిస్తాయనీ, ఆ ఖాతాదారు చెల్లింపులకు నగదు కాకుండా చెక్కునే యిస్తాడనీ, ఇక నల్లధనం రూపొందదనీ, ఆర్థికవ్యవస్థ పుంజుకుని ముందుకు సాగుతుందనీ వాదించారు. ఈ వితండవాదనతో నోట్ల రద్దు దుష్ఫలితాల నుండి చర్చను మళ్లించబూనుకున్నారు.

నోట్ల రద్దు తక్షణ ఫలితంగా పేదలు ఆదాయం కోల్పోతారనీ, అసంఘటితరంగం దెబ్బతింటుందన్న విమర్శ వుంది. దీర్ఘకాలికంగా చూసినప్పుడు అనియత రంగంలోని చిన్న పరిశ్రమలూ, చిల్లర వ్యాపారులూ దెబ్బతింటాయనీ, ఫలితంగా ఆర్థికవ్యవస్థ కుంటుపడుతుందన్నది నోట్లరద్దుపై ప్రధాన విమర్శ. ఈ విమర్శ సరైనదేనని ప్రభుత్వ గణాంకాలే తెలుపుతున్నాయి.

కేంద్రగణాంకశాఖ ఆగస్టు 31న విడుదల చేసిన గణాంకాల ప్రకారం స్థూలదేశీయ ఉత్పత్తి(జిడిపి) గత ఏడాది 7.9 శాతం వుండగా, 2017 జనవరి – మార్చి నెలల్లో 6.1 శాతం అంచనా నుండి, ఏప్రిల్ – జూన్ త్రైమాసికంలో 5.7 శాతానికి పడిపోయింది. ఆర్థిక సర్వే 2016–17 (ఆగస్టులోనే విడుదల చేశారు) రెండవ భాగంలో, జిడిపి వృద్ధిరేటు తగ్గిపోవటం "నోట్లరద్దుకు ముందే మొదలైంది. కాగా నోట్లరద్దు తర్వాతకాలంలో మరింత తీవ్రమైంది" అని చెప్పింది. నోట్లరద్దు వల్ల ఆర్థిక వ్యవస్థ పుంజుకుందన్న ఆర్థికమంత్రి ప్రకటనను ఈ వాస్తవాలు ఖండిస్తున్నాయి.

మోడీ అధికారంలోకి వచ్చేసరికే ఉత్పాదక రంగం కునారిల్లుతున్నది. దీనిని పునరుజ్జీవింప చేయటం తన లక్ష్యమని మోడీ చెప్పి "భారత్‌లో తయారి" పథకాన్ని ప్రకటించాడు. నోట్లరద్దు, వస్తుసేవల పన్నుతో ఇది మరింత కునారిల్లి స్థాపిత ఉత్పాదక సామర్థ్యంలో 70 శాతానికి మాత్రమే పరిమితమైంది. దీనివల్ల ఉత్పాదకరంగంలోని 25 విభాగాలలో 15 విభాగాలు కుచించుకుపోయాయని ఆర్థికసర్వే పేర్కొంది. ఉత్పాదకరంగంలో 80శాతం చిన్న, మధ్యతరహా పరిశ్రమలున్నాయి. 84శాతం శ్రామికులకు ఇవే ఉపాధి కల్పిస్తున్నాయి. ఇది కుచించుకుపోవటమంటే కార్మికులు ఉపాధి కోల్పోవటమే.

ఆర్థికవ్యవస్థ ఆరోగ్యాన్ని తెలిపే ముఖ్య సూచిక, ఉద్యోగ కల్పన. నోట్లరద్దు తర్వాత 2017 మొదటి త్రైమాసికంలోనే 15 లక్షల ఉద్యోగాలు అదృశ్యమయ్యాయి. ఈ వాస్తవాన్ని దాచిపెట్టేందుకు మోడీ తీవ్రంగా ప్రయత్నించాడు. ఏ ఉపాధీ దొరకని కూలీలకు ఉపశమనంకోసం ఏర్పాటు చేసిన ఉపాధిహామీ పథకంలో కల్పించిన ఉపాధిని ఉద్యోగకల్పనగా పేర్కొన్నాడు.

"తక్కువ పెట్టుబడి మదుపు, తగ్గిన ఎగుమతుల పరిమాణం, తరిగిన రుణపరపతి...కనీవినీ ఎరుగనిది" అని 2016–17 ఆర్థికసర్వే, ఆర్థికవ్యవస్థ బోలుతనాన్ని స్పష్టంచేసింది. భారత ఎగుమతులలో సగానికి పైగా చిన్న పరిశ్రమలు, వ్యవసాయ రంగాలనుండి సాగుతున్నది. ఎగుమతి అవుతున్న సరుకుల పరిమాణం తగ్గిందంటే ఈ రంగాలు దెబ్బతిన్నాయని అర్థం.

ప్రభుత్వ గణాంకాలే చెబుతున్న యీ వాస్తవాలు, నోట్లరద్దుకు మోడీ, జైట్లీలు చేస్తున్న సమర్ధనలకు ఎలాంటి ఆధారాలు లేవని తెలుపుతున్నాయి.

కొత్తనోట్ల ముద్రణకోసం రిజర్వుబ్యాంకు ఖర్చు పెట్టింది రూ။ 7965 కోట్లు. వీటిని వివిధ బ్యాంకులకు చేర్చటానికి అయిన ఖర్చు తెలియదు. కొత్తనోట్ల కొలతలకు తగ్గట్లుగా దేశవ్యాపితంగా వున్న 2 లక్షల ఏటిఎంలను సరిచేయటానికయిన ఖర్చు ఎంతో తెలియదు. నగదు లభ్యతలేక నెలలతరబడి ఆగిపోయిన కార్యకలాపాలవల్ల వచ్చిన ఆర్థికనష్టం లెక్కించవలసే వుంది. ఇవన్నీ కలిపితే వేలకోట్ల రూపాయల భారం ప్రజలపై మోపారు.

ఉపాధి కోల్పోయి పేదలు పొందిన నష్టాన్ని అంచనా వేసేదెవరు? ఏటిఎంల వద్ద తొక్కిడిలో కోల్పోయిన ప్రాణాలెన్ని? ద్రవ్యం లేక గడిపిన ఆకలిరాత్రుల విలువెంత? ఆత్మీయుల ఆస్పత్రి బిల్లుల చెల్లింపుకు ఖాతాలో డబ్బులున్నా చేతిలోకి రాక పడిన ఆందోళన ధర ఎంత? ఇంత ఆర్థిక, మానవ మూల్యం చెల్లించి సాధించిందేమిటి? **పరిపూర్ణ పూజ్యం.**

"నరేంద్రమోడీ నోట్లరద్దు నిర్ణయాన్ని ప్రకటించిన విధంగా నల్లధనాన్నీ, దొంగనోట్లనూ, అవినీతినీ, ఉగ్రవాదులకు ఆర్థిక తోడ్పాటునూ అరికట్టబోవటం లేదు. ఆర్థికరంగంలో తమ వైఫల్యాలను కప్పిపుచ్చు కోవటానికీ, ద్రవ్యసంక్షోభాన్ని ఎదుర్కొంటూ దివాళా తీస్తున్న బ్యాంకింగ్ వ్యవస్థను కాపాడుకోవటానికీ, రాజకీయ ప్రాబల్యాన్ని పెంచుకోవటమనే తమ నిజ ఉద్దేశాలను మరుగుపరిచేందుకే ప్రభుత్వం పై లక్ష్యాలను ముందు పెడుతున్నది. అసలు దోషులైన బడా బూర్జువాలనూ, బడా వ్యాపారులనూ, విదేశాలలో అక్రమ డబ్బు నిల్వదారులనూ రక్షిస్తూ, మరోవైపున ప్రభుత్వం సంక్షోభ భారాలను ప్రజల వీపులపై మోపేందుకు తీసుకుంటున్న చర్యలలో ఒకటి, పెద్దనోట్ల రద్దు".

నోట్లరద్దు ప్రకటన వెలువడగానే, సిపిఐ(ఎం–ఎల్) ప్రధాన కార్యదర్శి కా။ విశ్వం చేసిన ప్రకటనలోని భాగమిది. ఇది నోట్లరద్దు పరిస్థితినీ, దానివెనుకనున్న కారణాలనూ, రాగల పరిణామాలను సరిగ్గా అంచనా వేసిందని ఇప్పటి పరిస్థితి నిరూపించింది.

కాకులను కొట్టి గ్రద్దలకు వేసే విధానాలు భారత పాలకులకు కొత్తకాదు. తమ సామ్రాజ్యవాద, బడా బూర్జువా అనుకూల విధానాల ఫలితంగా ఏర్పడిన సంక్షోభాన్ని ప్రజలపై మోపుతూ వస్తున్నారు. ఇప్పుడు ద్రవ్యరంగంలో ఏర్పడిన సంక్షోభాన్ని నోట్లరద్దుతో ప్రజలపై మోపుతున్నారు.

ప్రభుత్వాల ఈ నాటకాలను ప్రజలు గమనిస్తున్నారు. దగాకోరు చర్యలతో మోసపోయేందుకు వారు సిద్ధంగా లేరు. వారు తమ జీవితాలపై జరుగుతున్న దాడులకూ దోపిడీకీ వ్యతిరేకంగా పోరాడుతారు.

**14-9-2017**

ooooo